www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| మంగళవారం | 20-05-2025 |




## తట్టపని, మట్టిపని, పారపనే కాదు..

# తలెత్తుకునేలా పాలించే పాలమూరోడిని..!



**పాలమూరంటే తట్ట, మట్టి, పార పనిచేసేటోళ్లే అనుకుంటున్నరు. కానీ ఇక్కడి నుంచి సీఎంగా ఎదిగి దేశమే శభాష్ అనే స్థాయిలో పాలన కొనసాగిస్తున్నామన్నాడు సీఎం రేవంత్‌రెడ్డి. అచ్చంపేట బహిరంగసభలో సీఎం మాట్లాడాడు. మళ్లీ లోకల్ స్పీచే ఇచ్చాడు. మహిళలే కాంగ్రెస్ పార్టీకి అండ అన్నాడు. ఫ్రీబస్సు పథకం ద్వారా ఏడాదిన్నరగా రూ. 5500 కోట్లు ప్రభుత్వం ఆర్టీసికి బాకీ పడిందన్నాడు. ఇదంతా మహిళల కోసమే చేస్తున్నామన్నాడు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని, యావత్ తెలంగాణ తమ సర్కార్‌కు అండగా నిలబడాలని ఆకాంక్షించాడు. కడుపులో విషం పెట్టుకుని తన మీద, సర్కార్ మీద ఎంత దుమ్మెత్తిపోసినా పాలమూరు బిడ్డగా సీఎంగా చేస్తున్న మంచి పనులు, ప్రజల ఆశీస్సులు తనకు అండగా ఉంటాయన్నాడు.** **- దండుగుల శ్రీనివాస్**

### ఇంకా ఏమన్నాడంటే...

నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం మీ బిడ్డగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నానన్నాడు. పోడ భూములపై పోరాటం చేసిన వారిని జైల్లో పెట్టిన చరిత్ర గత ప్రభుత్వానిదన్నాడు. పోడు భూముల్లో సోలార్ పంపుసెట్లను అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ఘనత తమ ప్రభుత్వాన్నిదన్నాడు. అచ్చంపేట నియోజకవర్గంలో రైతులందరికీ సోలార్ పంపుసెట్లు అందిస్తానన్నాడు సీఎం. తెలంగాణను దేశంలోనే ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నామన్న సీఎం.. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏడాదిలో 60 వేల ఉద్యోగ నియామకాలను చేపట్టామన్నాడు. నిత్యావసర ధరలను నియంత్రించి పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చిన నెంబర్ వన్ రాష్ట్రం తెలంగాణ అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశాడు. శాంతిభద్రతల పరిరక్షణలోనూ తెలంగాణ నెంబర్ వన్ గా నిలిచిందన్నాడు. పాలమూరోల్లకు పాలన చేతకాదన్న వాళ్లకు.. తెలంగాణను నెంబర్ వన్ గా నిలబెట్టగలమని నిరూపించామన్నాడు. కొంతమంది తమ అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో మనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్‌నుద్దేశించి అన్నాడు రేవంత్. కడుపునిండా విషం పెట్టుకుని తనపై విష ప్రచారం చేసే వారిని నేను పట్టించుకోనన్నాడు. పేదల ఆకలి తీర్చే రేవంతన్న సన్న బియ్యం మేమేం చేస్తున్నామో గుర్తు చేస్తుందన్నాడు. ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా మన పథకాలే ప్రజలకు నిజాలను చెబుతాయని, తమపై తప్పుడు ప్రచారం చేసేవారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.



# తనదాకా వస్తే..!

## సోషల్‌మీడియాపై రేవంత్ గగ్గోలు..!!

### అప్పుడు కేటీఆర్.. ఇప్పుడు రేవంత్..

### సీన్ మారింది.. లీడర్లు మారారు..! అంతే

**(దండుగుల శ్రీనివాస్)**

సేమ్ టు సేమ్ సీన్. అప్పుడు కేసీఆర్ కు ఇదే పరిస్థితి. ఇప్పడది రేవంత్ ఎదు ర్కొంటున్నాడు. సోషల్ మీడియాను తక్కువ చేసి చూశారు కేసీఆర్, కేటీఆర్. మెయిన్ మీడియాను చేతిలో పెట్టుకున్నారు. అవన్నీ తమ కాంపౌండ్‌లోని పెంపుడు కుక్కల్లాగే ప్రవర్తించాయి. అప్పుడు రేవంత్‌కు స్వచ్ఛం ధంగా సపోర్టు చేశాయి సోషల్ మీడియా హ్యాండిల్స్. కేసీఆర్ మీద కోపంతో. కేటీఆర్ అహంకారంపై ధిక్కార స్వరంతో. ఎహె పోరా మీతో ఏమవుతుంది..? అనుకున్నా రిద్దరు. అనుకున్నదే జరిగింది. ఎన్నికల్లో బీఆరెస్ ఓడింది. కాంగ్రెస్ గెలిచింది. ఓటమి తరువాత కేటీఆర్, కేసీఆర్ ఇద్దరూ తేరుకున్నారు. సోషల్ మీడియానే లోకంగా బతుకుతున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో ఉండి రోజూ చేసిది ఇదే. సోషల్ మీడియాలో సర్కార్‌ను ఎవరెవరు ఎలా తిడుతున్నారు..? ఎవరేం అనుకుంటున్నారు..? మనవాళ్లతో ఎలా ఇంకా తిట్టించాలి..? ఇదే పని. కేటీఆర్ దీని కోసం నెలకు కోట్లు వెచ్చించి ఓ సైన్యాన్నే నడిస్తున్నాడు. విచిత్రంగా రేవంత్ ఇప్పుడు అదే సోషల్ మీడియాను తుక్కుతుక్కు తిడుతున్నాడు. అసెంబ్లీలోనైతే ఏకంగా బట్టలిప్పి కొట్టేదాకా పోయాడు. అప్పుడు కాపాడిన సోషల్ మీడియా ఇప్పుడు రేవంత్ మెడలో పామై కరుస్తున్నది. ఎవరు చేసుకున్నారిదంతా. తనదాకా వస్తే గగ్గోలు పెట్టే రేవంత్... అప్పుడు తనకు సపోర్టు చేసి నప్పుడు మాత్రం కిక్కురుమనలేదు. అధికా రం మనదే కదా. మెయిన్ మీడియా అంతా తన పాటే పాడుతున్నది కదా అని తలెగరే సుకుంటున్నాడు. సేమ్ సేమ్ కేసీఆర్, కేటీఆర్ లెక్కనే. కానీ రేవంత్ మాత్రం తనూ సోషల్ మీడియాను సమర్థవంతంగా నడపా లనే సోయి లేదు. అంత సీన్ కూడా అక్కడ లేదు. ఎందుకంటే ఆ సర్కార్‌లో ఎవరేం చేస్తున్నారో ఆయనకే తెలియదు. ఎవరి వల్ల ఎలా రోజుకింత పార్టీ, ప్రభుత్వం డ్యామేజీ అవుతుందోననే భయంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. ఇలా వేదికలనెక్కినప్పుడు విషం చిమ్ముతున్నారు.. చూసుకుందాం..! జనాలే చూసుకుంటారం టూ వేదాంతాలు పలుకుతున్నాడు. కానీ జనానికి ఏమేం చెప్పాలో ఎలా చెప్పాలో ఇక్కడ సమర్థవంతంగా కేటీఆర్ చేసి చూపిస్తున్నాడు. సోషల్ మీడియాలో సినిమా చూపిస్తున్నాడు.



# తిట్టపోరా.. సర్కార్..!

## పాతబస్తీ అగ్ని ప్రమాద ఘటనపై కేటీఆర్ తీరు..

**ప్రతీదీ రాజకీయమే అయి కూర్చుంటుంది. శవ రాజకీయాలకు ఏదీ వదలరన్నట్టుగానే ఉంది ఇక్కడ పరిస్థితి. గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాద సంఘటన స్థలాన్ని బీఆర్ఎస్ నేత కేటీఆర్ సందర్శించిన తరువాత ఆయన స్పందించిన తీరు అట్లనే ఉంది. భాదిత కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్ మీడియాతో మాట్లాడాడు. ఇక్కడ రాజకీయం మాట్లాడటానికి రాలేదన్నాడు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడానికీ రాలేదన్నాడు. ఆ వెంటనే అందుకున్నాడు. అసలు ఈ ప్రమాదంలో ఇంత మంది చనిపోవడానికి రేవంత్‌రెడ్డే కారణమన్నట్టుగా మాట్లాడాడు. చివరకు మీరేమైనా బాధిత కుటుంబాలకు సాయం చేస్తారా అంటే మాత్రం నీళ్లు నమిలాడు. తరువాత ఆలోచించి చెప్తానని చల్లగా జారుకున్నాడు. ఇదో శవ రాజకీయమనే చెప్పాలి. అంతేగా మరి. ప్రాణాలు పోతే ఏందీ..? ఎవరి రాజకీయం వారిది. ఎవరి రాజకీయ అవసరాలు వారివి. అదే జరిగిందక్కడ.** **-దండుగుల శ్రీనివాస్**

### కేటీఆర్ ఏమన్నాడంటే..!

125 సంవత్సరాల నుంచి చార్మినార్ దగ్గర ఉంటున్న అగర్వాల్ కుటుంబం లోని 17 మంది చనిపోవడం మనసున్న ప్రతీ ఒక్కరిని కలిచివేసింది. బాధిత కుటుంబసభ్యులు ఎవరినీ నిందించడం లేదు. కాని వారు కొన్ని విషయాలు చెప్పారు. ఫైర్ బ్రిగేడు నీళ్లు లేకుండా వచ్చింది. ఫైర్ బ్రిగేడ్ వాళ్లు సరైన మాస్కులు లేకుండా రావడంతో లోపలికి వెళ్లలేకపోయారు. అంబులెన్స్ లలో కూడా ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు లేకపోవడం దారుణం. ఈ కనీస సదుపాయలు ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్ లో ఉంటే కొన్ని ప్రాణాలు బతికేవని బాధిత కుటుంబ సభ్యులు అంటున్నారు. అగ్నిప్రమాదం జరగగానే స్థానికులైన హిందువులు, ముస్లింలు పెద్ద సంఖ్యలో వచ్చి మమ్మల్ని కాపాడారని చెప్పారు. మాకు జరిగిన నష్టం రాబోయే రోజుల్లో ఎవరికీ జరగకూ డదని కోరుకుంటున్నారు భవిష్యత్తులో ఎవరు చనిపోకుండా చూడమని కోరారు. నేను రాజకీయం చేయడానికి రాలేదు. ఎవరినీ విమర్శించడం లేదు. కాని ఎండాకాలం వచ్చిందంటే మున్సిపల్ శాఖ మంత్రి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన చర్యల మీద రివ్యూ సమావేశం పెట్టుకోవాలి. పాతబస్తీ అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రదేశం. ఏదైనా ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్లు, అంబులెన్స్ లు రావడానికి కూడా వీలుకాలేదు. అధికారులకు నిరంతరం ట్రైనింగ్ ఇవ్వాలి. తరుచుగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలి. ఇవేవి జరగలేదు. ఇది మంచిది కాదు.. అని అన్నాడు కేటీఆర్. చార్మినార్ దగ్గరకు విశ్వ సుందరీమణుల ను తీసుకుపోయావు గానీ, ఇక్కడ పరిస్థితిని గాలికొదిలేశావు అని కూడా సీఎంను అర్సుకున్నాడు చివరాఖర్లో.



# అనుకున్నదొక్కటీ.. అయ్యిందొక్కటీ..!

## అందాలపోటీలను సైడ్‌ట్రాక్ పట్టించిన బీఆరెస్..!

**వాస్తవం ప్రతినిధి- హైదరాబాద్:**

అందాలపోటీలు ఇక్కడ నిర్వహించడమే మోగానీ రేవంత్‌కు తలప్రాణం తోకకొచ్చింది. ప్రపంచ పటం ముందు మన రాష్ట్రాన్ని ఉంచేలా ఘనంగా, పకడ్బందీగా వీటిని నిర్వహించాలని తంటాలు పడి ఏదో చేయబోయాడు. హనుమంతుడిని చేయబోతే కోతై కూర్చుందన్నట్టుగా..దీన్ని సైడ్‌ట్రాక్ పట్టించేశారు బీఆరెస్ లీడర్లు. వాళ్ల సోషల్ మీడియా వారియర్లు. హచ్ కుక్కలాగ వెంటే పడ్డాడు. సర్కార్ ఏం చేసినా దాంట్లో వక్రభాష్యాలు వల్లెవేశారు. అంతిమంగా ఈ పోటీల ఎపిసోడ్ మొత్తం సర్కార్‌ను బద్నామ్ చేసేలా చేసి, తమకు మైలేజీ వచ్చేలా మలుచుకోవడంలో బీఆరెస్ సక్సెస్ అయ్యింది. ఓ వైపు యుద్ధం జరుగుతుంటే అందాల పోటీలా..? అనే దగ్గర నుంచి పోరాటం మొదలు పెట్టింది బీఆరెస్. ఆ తరువాత సీతక్క ఎపిసోడ్‌ను రంజుగా వాడుకున్నారు. ఆమె సమర్ధనను వాడేసుకున్నారు. చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు చూపాలనుకున్న సర్కార్ ఆలోచన.. బీఆరెస్‌కు చివరగా ఎంత కలిసి వచ్చిందంటే.. ఆఖరికి హరీశ్‌రావు కూడా తన ఫేస్‌బుక్ ఇవికదా కేసీఆర్ ఆనవాళ్లు అంటూ విశ్వ సుందరీమణులు తిరిగిన ప్రాంతాల ఫోటోలన్నీ షేర్ చేసుకున్నాడు. యాదగిరిగుట్టతో సహా. అలా ఈ పోటీల నిర్వహణ సర్కార్ చావుకు రాగా.. బీఆరెస్‌కు రాజకీయ మైలేజీని తెచ్చిపెట్టేలా చేసుకుని ఓ వికట్టహాసం చేసింది వారి సోషల్‌మీడియా టీమ్.



# అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ పుష్కరాలపై లేదా.?

## సరస్వతి పుష్కరాలకు రూ.35 కోట్లు ఏ మూలకు సరిపోతాయి

- పుష్కరాల నిర్వహణలో ప్రభుత్వం ఫెయిలైంది
- కుంభమేళాలో 50 కోట్ల మంది భక్తులకు అద్భుతమైన ఆతిథ్యమిచ్చాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**వాస్తవం, కాళేశ్వరం:**

కాంగ్రెస్ ప్రభుత్వానికి అందాల పోటీపై ఉన్న శ్రద్ధ పుష్కరాల నిర్వహణ పట్ల లేకుండా పోయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు రూ.35 కోట్లు మాత్రమే కేటాయిం చారని, ఆ నిధులు ఏ మూలకు సరిపోతా యని ప్రశ్నించారు. కుంభమేళా సందర్భం గా 50 కోట్ల మంది భక్తులకు తమ ప్రభుత్వం అద్భుతమైన ఆతిథ్యమిచ్చిందని, కాళేశ్వరం పుష్కరాలకు విచ్చేసే 50 లక్షల మందికి సరైన ఆతిథ్యం ఇవ్వలేక పోతున్నారని అసహనం వ్యక్తం చేశారు.